ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 14
సంచిక : 01
పేజీలు : 5 వెల రూ. 2/-
మంగళవారం
26 ఏప్రిల్ 2026
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com



## ముఖ్యమంత్రితో పలువురు భేటీ

**ఏఎం న్యూస్, హైదరాబాద్,మే25:** సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పలువురు కలిశారు. ఇటీవల ఎంపికైన వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తమను ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సెక్రటేరియట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను వారు ప్రస్తావించారు. వీరితో మంత్రి జూపల్లి కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డిలు ఉన్నారు.

## నాలుగోసారి పెరిగిన పెట్రో ధరలు

- పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు
- పెట్రో ధరల పెంపు ఎవరి కోసం
- ఎవరి లాభంకోసం ధరలు పెంచుతున్నారు
- కేంద్రం తీరుపై మండిపడ్డ మల్లికార్జున ఖర్గే



2 లో

### కోటి మంది మహిళను

# కోటీశ్వరులను చేస్తాం..

- ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు
- సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
- రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం
- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్‌గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి

2 లో



### అంతర్‌రాష్ట్ర సమన్వయంతో

## త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు చర్చలలో పూర్తి ప్రాధాన్యత
- పరస్పర అవగాహనతోటే కృష్ణా జలాల వినియోగం
- రెండు రాష్ట్రాల త్రాగునీటి అవసరాలపై కలిసి పోయే విదంగా చర్యలు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



2 లో

## సొంత చెల్లెలు, బావ ఫోన్లు ట్యాప్ చేసిన ఘనుడవు

- ఇందిరమ్మ ఇళ్లు ఉంటున్న వారిని అడిగితే తెలుస్తుంది
- కెటిఆర్ సవాల్‌కు మంత్రి పొంగులేటి ప్రతిసవాల్



2 లో

### అధికార పార్టీ వైఫల్యాలతో పాటు ప్రజల అండతో

# భవిష్యత్తులో అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే

- అధికారంలోకి వస్తే 24 గంటలు మంచినీరు ఇచ్చే బాధ్యత తీసుకుంటాం
- కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు అయిన నిర్మించిందా...
- ఒకవేళ నిర్మించినట్టు చూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటా...
- కష్ట కాలంలో పార్టీకి అండగా ఉండే వారిని ఎప్పుడూ మరవదు...
- కూకట్పల్లి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం...
- ఎవరైతే కష్టపడతారో ప్రజల్లో ఉంటారో వారికి కార్పొరేటర్ టికెట్లు...
- కూకట్పల్లి నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశంలో కేటీఆర్

2 లో



# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

**ఏఎం న్యూస్, హైదరాబాద్,మే25:**
తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద



పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామి కవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. మహిళల అభ్యున్నతిని అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేసి, ఉచిత బస్సు ప్రయాణం వద్దంటూ రెచ్చగొట్టినా వెనక్కి తగ్గలేదన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ.10 వేల కోట్లను ప్రభుత్వమే సంస్థకు చెల్లించిందని స్పష్టం చేశారు. మహిళలను బస్సులకు యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగానే జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 553 బస్సులను ప్రారంభించబోతున్నామని సీఎం వివరించారు. ఇదే సమయంలో సొంత చెల్లెళ్లను ఇళ్ల నుంచి వెళ్లగొడుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన పరోక్షంగా స్పందిస్తూ, బయటకు వెళ్లగొట్టబడిన చెల్లెలు ఎలా శాపనార్థాలు పెడుతుందో అందరం చూస్తున్నామన్నారు.

# అంతర్‌రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**ఏఎం న్యూస్, హైదరాబాద్,మే25:**
నీటివినియోగంపై ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షణకు అనుకూలంగా ఉండే విధంగా రెండు రాష్ట్రాల మధ్యన ఒడంబడిక కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణా-కర్ణాటక రాష్ట్రల మధ్యన కృష్ణా జలాల వినియోగం, త్రాగు, సాగునీటి అవసరాలపై కర్ణాటక రాష్ట్ర చిన్ననీటి తరహా శాఖా మంత్రి బోసురాజు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ సచివాలయంలో సోమవారం రోజు భేటి అయ్యారు. భేటీలో రాష్ట్ర ఎక్సయిజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, పశు సంవర్ధక, క్రీడల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా శాఖా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి రాయచూరు లోకసభ సభ్యులు జీ. కుమార్ నాయక్,నాగర్ కర్నూల్ లోకసభ సభ్యులు మల్లు రవి లతో పాటు రాయచూరు రూరల్ శాసనసభ్యులు బసన్నగౌడ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,మేఘారెడ్డి,శివకుమార్ రెడ్డి,వంశీకృష్ణ, రాష్ట్ర నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ. ఎన్.సి రమేశ్ బాబు,కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖా కార్యదర్శి బి.కే పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో అనుసరించ బోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనాకారిగే ఉండేలా నిర్ణయం తీసుకు



న్నామన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా ఉండేలా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక చిన్న నీటి తరహా శాఖామంత్రి బోసురాజు కు సమగ్రంగా వివరించి నట్లు ఆయన తెలిపారు.కృష్ణా నదిపై ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణా నికి సంబంధించిన సాంకేతికత అంశాలపై విస్తృతంగా చర్చించి నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణా సాగునీటి, త్రాగునీటి హక్కులు పరిరక్షణ భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధి విధానలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమ స్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచి నట్లు ఆయన చెప్పారు. కృష్ణానది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు.సాగునీటి, త్రాగునీటి విషయంలో రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్ల కుండా ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విదంగా కృష్ణా జలాల వినియోగం పై కూలంకషంగా రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జాతిగాయని ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్యన జరిగిన చర్చలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వివరించి సమిష్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## అధికార పార్టీ వైఫల్యాలతో పాటు ప్రజల అండతో
# భవిష్యత్తులో అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే

**ఏ ఎమ్ న్యూస్, కూకట్పల్లి:**
బిఆర్ఎస్ పాలనలో ప్రజలు నీటికీ, విద్యుత్ కి ఇబ్బందులు పడలేదని కాంగ్రెస్ పాలనలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ప్రజల అండదండలతో భవిష్యత్తులో తిరిగి బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్తు ఇచ్చిన మాదిరిగానే 24 గంటలు మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని కూకట్పల్లి ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం కూకట్పల్లిలోని ఎన్ కే ఎన్ ఆర్ గార్డెన్స్ లో స్థానిక శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ ఎస్. ఐ .ఆర్ కు సంబంధించి ఓట్లు తొలగింపు ప్రక్రియలో అవకతవకలకు సంబంధించి ప్రజలకు అర్థమయ్యేటట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఓటు మీ హక్కు అంటూ ప్రజలకు ఓటు యొక్క ఆవశ్యకత వివరిస్తూ ఇంటికి ఎస్ఐఆర్ నమోదుకు సంబంధించి సంబంధిత అధికారి వచ్చినప్పుడు ఏ విధంగా వారికి వివరించాలనే విషయాన్ని వివరించారు. కూకట్పల్లి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో కార్యకర్తలు సైనికుల్లాగా పని చేస్తూ అత్యధిక మెజారిటీ స్థానం ఎమ్మెల్యేకి ఇచ్చారని భవిష్యత్తులో కూడా లక్ష మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కూకట్పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు అందరూ ఒకే తాటిపై ఉండి ముందుకు వెళ్లడం ఆదర్శంగా తీసుకోవాలని కష్ట కాలంలో పార్టీ కండగా ఉండే వారిని పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందని చెప్పారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఏ ఒక్క కార్యకర్తను కూడా ఇకమీదట వదిలిపెట్టేది లేదని వారందరినీ ఆదుకునే బాధ్యత బిఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని ప్రకటించారు. ఎవరైతే కష్టపడతారో ప్రజల్లో ఉంటారో వారికి కార్పొరేటర్ టికెట్లు కచ్చితంగా వస్తాయని భరోసా ఇచ్చారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే 24 గంటలు విద్యుత్ ఏ విధంగా ఇచ్చామో అదేవిధంగా 24 గంటలు మంచినీరు ఇచ్చే బాధ్యత కచ్చితంగా తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు అయిన నిర్మించిందా అని ప్రశ్నించారు. ఒకవేళ నిర్మించినట్టు చూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాలు విసిరారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనాటి మంత్రిగా కేటీఆర్ కూకట్పల్లి నియోజకవర్గాన్ని వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. బాల నగర్, జేఎన్టీయూ, కైతలాపూర్ ఫ్లై ఓవర్ నిర్మాణం, అండర్పాస్ బ్రిడ్జ్ లు, మంచినీటికి ఇబ్బంది లేకుండా వాటర్ ట్యాంకులు, ఎస్టీపి ప్లాంట్లు, నూతన డ్రైనేజ్ వ్యవస్థ ఎక్కడికక్కడ ఓపెన్ జిమ్ములు




,పార్కులు ,ఇలా చెప్పుకుంటూ పోతే వేల కోట్ల రూపాయ లు అభివృద్ధికి వెచ్చించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క అభివృద్ధి పని కూడా ముందుకు వెళ్లలేదని ఇంకా సిగ్గు లేకుండా బాలనగర్ ఫ్లైఓవర్ ,కైతలాపూర్ ఫ్లై ఓవర్లు మేము నిర్మించామని చెప్పడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఆనాడు నిధులు కొరత లేకుండా నెలకి 30 కోట్లు వరకు మంజూరు చేసేవారని కానీ నేడు రెండున్నర సంవత్సరాలు గడిచినా కూడా 25 కోట్లు కూడా నిధులు మంజూరు కావడం లేదని దీంతో ఏమీ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ ,ఎమ్మెల్సీలు కురుమయ్యగారి నవీన్ కుమార్, శంబిపూర్ రాజు, గజ్జల నాగేష్, రాగిడి లక్ష్మారెడ్డి, కూకట్పల్లి నియోజకవర్గం పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ ,మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబురావు, పగుడాల బాబురావు, తూము శ్రావణ్ కుమార్, సబియా గౌసుద్దీన్, మహేశ్వరి శ్రీహరి ,మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షులు సెక్రెటరీలు,మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### సొంత చెల్లెలు, బావ
# ఫోన్లు ట్యాప్ చేసిన ఘనుడవు

**ఏఎం న్యూస్, హైదరాబాద్,మే25:**
సొంత చెల్లి, బావ ఫోన్‌లు కూడా ట్యాప్ చేసిన కేటీఆర్‌కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత కూడా లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై కేటీఆర్ కు మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర సంవత్సరాల్లోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నాం. ఇందిరమ్మ పాలన అంటే ఏంటో గ్రామాల్లోకి వెళ్లి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుంది కేటీఆర్ అంటూ సవాల్ చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందన్నారు. జూన్ 1న మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని మే 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించాం. రాజకీయ సన్యాసం తీసుకుంటా అంటున్న డ్రామారావు గారు... అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని ఓడగొట్టి, లోక్‌సభ ఎన్నికల్లో మీకు సున్నా సీట్లు ఇచ్చి, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాల్లో కూడా మిమ్మల్ని ఓడగొట్టిన ప్రజలంతా.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు సున్నా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదు! రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదు. డబుల్ బెడ్ రూం ఇండ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఓట్లు అడగకూడదు. సవాల్‌కు సిద్ధమేనా కేటీఆర్ అని అన్నారు.

# నాలుగోసారి పెరిగిన పెట్రో ధరలు

**ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,మే25:**
దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తాజా ధరల సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంచినట్లు వెల్లడించాయి. ఈ సవరించిన ధరలు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా గత పది రోజుల వ్యవధిలో ఇది నాలుగోసారి ఇంధన ధరలు పెరగడం గమనించదగ్గ విషయం. వరుస ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ తాజా పెంపు మరింత భారంగా మారింది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు సుమారు రూ.8 వరకు పెరిగినట్లు అంచనా. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ రూ.103.74గా నమోదవగా, విజయవాడలో పెట్రోల్ ధర రూ.117.19, డీజిల్ రూ.104.88కు పెరిగింది. ఇంధన ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదలని నిపుణులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరాపై నెలకొన్న అనిశ్చితి కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు ఎగబాకుతున్నాయి. ఈ ప్రభావాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు నేరుగా వినియోగదారులపై మోపుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా రవాణా ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలపై కూడా పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారితే భవిష్యత్తులో కూడా ఇంధన ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.
రోజురోజుకు పెరుగుతోన్న ఇంధన ధరల పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. ఈ రోజూవారీ దోపిడీ వల్ల ఎవరు లాభపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. 2014లో రూ.71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను మోదీ సర్కారు 2026 నాటికి రూ.102.12కు చేర్చిందని ఎద్దేవా చేశారు. రెండు వారాల లోపే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ఇది నాలుగోసారి అని.. ఈ రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదన్నారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు వరుసగా 5.8, 4.44, 3.90 శాతం పెరిగాయన్నారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం భాజపా నైజమన్నారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్‌ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం భాజపా దోపిడీ భారాన్ని మోస్తోందన్నారు. దేశవ్యాప్తంగా నేడు మరోసారి భారీగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెంచాయి. పెంచిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. కాగా ఇప్పటికే మూడు విడతలుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. దీంతో దిల్లీలో పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ.103.74గా ఉంది.

## దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

**ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం అబద్ధాలు**
**ఎన్సాన్‌పల్లి ఐకెపి సెంటర్ సందర్శించిన హరీష్ రావు**

**ఏఎం న్యూస్, సిద్దిపేట,మే25:**
ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు అరిగోస పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. యూరియా, సాగునీరు, కరెంట్ సరఫరా, పండిన పంట కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయ్యిందన్నారు. రైతులు ఇంత బాధపడటం మొట్టమొదటి సారి చూస్తున్నామన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్లో వరి ధాన్యాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రభుత్వం ఉన్నా ఇట్లాంటి దుర్భర పరిస్థితులు ఎదురు కాలేదని చెప్పుకొచ్చారు. 'ఉత్తమ్ నీది నోరా మోరా.. మొన్న 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అని చెప్పి ఇప్పుడు 70 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అనడం ఎంతవరకు సబబు' అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం కాదని.. కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కోటి మెట్రిక్ టన్నుల ధాన్యంలో 70 లక్షలు కొంటే మిగతా ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని మాజీ మంత్రి ప్రశ్నించారు. తాలు పెడితే తోలు తీస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. సిద్దిపేట నియోజకవర్గంలో క్వింటాల్‌కు 5 కిలోలు తరుగు తీస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని విమర్శించారు. రోహిణి కార్తె వచ్చినా కళ్లాల్లోనే ధాన్యం, రైతులు ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటిదాకా ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నదని తెలిపారు. రైతులు గుండెలు బాదుకుంటున్నా ఈ ప్రభుత్వానికి కళ్లు కనబడటం లేదంటూ విమర్శలు గుప్పించారు. వరి కుప్పలపైనే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ÷ూష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు వదిలారని హరీశ్ రావు తెలిపారు. 'మిషన్ మోడ్‌లో వడ్లు కొనాలని రేవంత్ అంటున్నారు. నీది మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్. నిన్న కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులకు ఆదేశాలు ఇస్తారని రైతులు ఆశించారు. రైతుల ఆశలు నిరాశ అయ్యాయి. 45 రోజుల్లో మొత్తం రైతుబంధు వేస్తానని చెప్పి 60 రోజులు గడిచినా వేయలేదు. రేవంత్ రెడ్డి కేవలం పేపర్ టైగర్ మాత్రమే... దేవుని మీద ఒట్టు పెట్టి మాట తప్పిన రకం నువ్వు. ఢిల్లీ ట్రిప్పులు మాని.. లారీల ట్రిప్పులు పెంచు. ఒకటి, రెండు రోజుల్లో మార్పు రాకుండే స్వయంగా నేనే కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నా చేపడతా. వేలాది మంది రైతులతో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌లను దిగ్బంధిస్తాం. రాజకీయ విమర్శలు మాని పరిష్కార మార్గాలు చూడండి' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

**మిగతా ధాన్యం కూడా కొనడానికి ప్రభుత్వం సిద్ధం**
**కేంద్రం తీరుతోనే ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు**
**బిజెపి తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల**

**ఏఎం న్యూస్, ఖమ్మం,మే25:**
దేశంలో అన్నిరకాల పంటలను తమ ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వరిధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ఇప్పుడు సిగ్గులేకుండా బీజేపీ నేతలు బస్సుయాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కనీసం గన్నీ బ్యాగులు తీసుకురాలేని పరిస్దితి ఉందని అన్నారు. కేందప్రభుత్వ దుర్మార్గమైన విధానాల కారణంగానే రైతాంగం కష్టాల్లో ఉన్నారని తెలిపారు. కనీసం డీజిల్ ఇవ్వకపోవటంతో ఎక్కడికక్కడా ధాన్యం రవాణా ఆగిపోయిందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ధ్వజమెత్తారు. అటు సాగర్ ఆయకట్టు.. ఇటు సీతారామ ఆయకట్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కృష్ణా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పలు సంస్థలను నిర్వీర్యం చేశారని ఫైర్ అయ్యారు. తెలంగాణలో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని.. ఇంకా కొంటామని స్పష్టం చేశారు. సోమవారం యాతాలకుంట టన్నెల్‌ను మంత్రి పరిశీలించారు. యాతాలకుంట టన్నెల్ వద్ద అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందాలనేది తన చిరకాల వాంఛ అని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం ఎక్కువ అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు గోదావరి ఆయకట్టు దక్కలేదని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చివరి ప్రాంతమైన ఖమ్మానికి గోదావరి జలాలు అందలేదని ప్రస్తావించారు. ఎక్కువ భూభాగం ఎన్నెస్పీ కెనాల్ పైభాగం.. కింద భాగంలో గోదావరి ఉండటంతో నీరు అందలేదని అన్నారు. తాను తెలుగుదేశం పార్టీలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసి.. అప్పటి ముఖ్యమంత్రిని.. ఖమ్మానికి గోదావరి జలాలు అందించాలని కోరానని ప్రస్తావించారు. నల్గొండ ఎ÷-లోరైడ్ పీడిత ప్రాంతానికి మాజీ సీఎం ఎన్టీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవకాశం ఇచ్చారని తెలిపారు. గోదావరిపై మొట్టమొదట దేవాదుల ప్రారంభించామని చెప్పుకొచ్చారు. గోదావరిపై ఎత్తిపోతల పథకాలకు తప్ప మరో అవకాశం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. గోదావరిపై 1998లో దుమ్ముగూడెం ప్రతిపాదన తీసుకువచ్చామని వివరించారు. ఆనాడు దుమ్ముగూడెం వద్ద రాజీవ్ సాగర్ - ఇందిరా సాగర్ వరకు ప్రారంభించిన పంపులు మోటార్లకే పరిమితమయ్యాయని అన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని
# ఢిల్లీలో జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్‌ను కలిసిన ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్

ఏ ఎం న్యూస్ ఓయూ:
దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆ కమిషన్ చైర్పర్సన్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ ను సభ్యులు ప్రొఫెసర్ సుష్మ యాదవ్ రవీందర్ జైన్లను కలిసి గంట సేపు వివిధ అంశాలపై ముఖ్యంగా వేల సంవత్సరాలుగా దళితులు మరియు దళిత క్రైస్తవులు అంటరాని వారిగా అనేక అవమానాలు పడుతున్నారని వారు మతం మారిన వారి కులం మారని కారణంగా అన్ని రంగాల్లో వివక్షత ఎదుర్కొంటున్నారని అందుకే దళిత బుద్ధిష్టులు సీక్కులకు షెడ్యూలు కులాల హోదా కల్పించినట్లే దళిత క్రైస్తవులకు ఆ హోదా కల్పించాలని RPI(భీమ్ రావ్ అంబేద్కర్) పార్టీ తెలంగాణ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు సోమవారం ఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ లోని కమిషన్ ఆఫీస్‌లో ప్రొఫెసర్ నటానియల్ తో కలిసి 300 వందల పేజీల ఎవిడెన్స్ రిపోర్ట్ అందించారు అగ్రవర్ణాలు క్రైస్తవులుగా మారితే జుబౌ రిజర్వేషన్లు వర్తిస్తున్నాయని అలాగే బీసీలు క్రైస్తవులుగా మారిన వారి రిజర్వేషన్లు అనుభవిస్తున్నారని చివరికి ఆదివాసి గిరిజనులు క్రైస్తవులుగా మారిన వారికి



రిజర్వేషన్లు వర్తిస్తున్నాయని కేవలము షెడ్యూల్డ్ కులాలకు మాత్రమే క్రైస్తవ మతం మారితే రిజర్వేషన్లు రద్దు అవుతున్నాయని రాజ్యాంగంలో ఎక్కడ మతపరమైన రిజర్వేషన్లను అంగీకరించ లేదని అంతేకాకుండా షెడ్యూలు కులాల రిజర్వేషన్ల విషయంలో ఏ ఆర్టికల్లోనూ హిందూ దళితులకు మాత్రమే రిజర్వేషన్లు వర్తిస్తాయని లేదని కేవలము 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు పారానంబర్ త్రీ ని ఆధారంగా చేసుకుని వారికి రిజర్వేషన్లు రద్దు చేయడం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని అందుకే 1950 ఆర్డర్ ను సవరించడం లేదా రద్దుచేసి దళిత క్రైస్తవ కూడా ఎస్సీ హోదా కల్పించాలని ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ కోరారు అన్ని మతాల్లో అంటరాని వారికి వివక్షత కొనసాగి కొనసాగినట్లే క్రైస్తవ మతంలో కూడా కులాపరమైన వివక్షతను కొనసాగిస్తున్న కారణంగానే కాథలిక్ క్రైస్తవ అధినేత పోపు జాన్ పాల్ భారత దేశంలో కులవీచిత ఉందని అందులో కతలి క్రైస్తవులు పాటిస్తున్నారని అంగీకరించారు క్రైస్తవ అధినేత అంగీ కరించినప్పుడు భారత న్యాయవ్యవస్థ అలాగే పాలన వ్యవస్థ ఎందుకు అంగీకరించదని కేవలం 1950 ఆర్డర్ టెక్నికల్ అంశమేనని రాజ్యాంగంలో ఎక్కడ హిందూ షెడ్యూల్ కులాలకు మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలని లేదని అలాగే పార్లమెంటులో ఈ అంశంపై చర్చ జరగనేలేదని అలాంటప్పుడు క్రైస్తవ మతం మారిన షెడ్యూల్ కులాలకు రిజర్వేషన్లు ఇవ్వకపోవడం రాజ్యాంగ వ్యతిరేకమే కాకుండా మానవ హక్కుల ఉల్లంఘన అని అవసరమైతే ఈ అంశంపై అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆశ్రయిస్తామని ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ కమిషన్‌కు వివరించారు.

# గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీదే విజయం: మేకల సారంగపాణి

ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ :
గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా విజయం భారతీయ జనతా పార్టీదేనని మేకల సారంగపాణి ధీమా వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన సోమవారం సీతాఫల్మండిలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ జిల్లా ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకుల సమావేశంలో గ్రేటర్ ఎన్నికల వ్యూహాలు, పార్టీ సంస్థాగత వ్యవహారాలు, వివిధ కమిటీల పనితీరుపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, తెలంగాణలో కూడా అదే తరహా పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌పై బీజేపీ జెండా ఎగరవేస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీని కిందిస్థాయి నుంచి బలోపేతం చేసి సమర్థవంతమైన నాయకత్వాన్ని తయారు చేస్తామని, కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని



తెలిపారు. గెలిచే సామర్థ్యం ఉన్నవారికే టికెట్లు కేటాయిస్తామని కేంద్ర మంత్రి జి . కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ స్పష్టం చేసినట్లు చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజల్లో విశ్వాసం తగ్గిపోయిందని, సంక్షేమం మరియు అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేసిన నాయకులకు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని విమర్శించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే వారికి బీజేపీలో తగిన గుర్తింపు, బాధ్యతలు లభిస్తాయని మేకల సారంగపాణి పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు కందటి నాగేశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించగా, రాష్ట్ర నాయకుడు రాచమల్ల కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు కనకట్ల హరి, ఆకారం రమేష్, జిల్లా కార్యదర్శులు శారదా మల్లేష్, మద్దెర్ల శ్యాంసుందర్, అజయ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తాం: మేకల కీర్తి హర్ష కిరణ్

### రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు బీజేపీ కైవసం చేసుకుంటుంది

ఏ ఎం న్యూస్/ హైదరాబాద్ :
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని ముఖ్యంగా సికింద్రాబాద్ నియోజకవర్గం లోని అన్ని డివిజన్లను బీజేపీ కైవసం చేసుకుంటుందని బిజెపి మహిళా నాయకురాలు, బౌద్ధనగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్ష కిరణ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మధురానగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బీజేపీ పార్టీలో చేరిన నాటి నుంచి ప్రజా సేవనే ధ్యేయంగా పెట్టుకుని నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. బౌద్ధనగర్ డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను స్వయంగా పరిశీలిస్తూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల నాయకులు, ప్రజలను కలుపుకొని ప్రజా సమస్యలపై పోరాటం



చేస్తున్నామని ఆమె తెలిపారు. గత ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓడిపోయినప్పటికీ ప్రజలకు ఎప్పుడూ దూరం కాలేదని, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని గుర్తు చేశారు. ప్రజల సమ స్యలను పరిష్కరించేందుకు కృషి చేసే నాయకుడే నిజమైన నాయ కుడని పేర్కొన్న మేకల కీర్తి హర్ష కిరణ్, ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వచ్చి హామీలు ఇచ్చే నాయకులను ప్రజలు గుర్తించాలని సూచించారు. ప్రతిరోజూ ప్రజా సమస్యలపై పోరాడే నాయకత్వానికి అవకాశం ఇవ్వాలని కోరారు. బౌద్ధనగర్ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రజల ఆశీర్వాదం మరియు మద్దతుతో మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ నాయకులు హనుమంతు ముదిరాజ్, సాయ్ దత్తు, సత్యనారాయణ, శ్రీనివాస్, వనమాల శ్రీనివాస్, భిక్షపతి, క్రాంతి, నాగారాణి, శ్యామ్ బాలయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మీడియా కో కన్వీనర్‌గా (ఎస్టి మోర్చా) బానోతు జ్యోతి నియామకం


ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :
భారతీయ జనతా పార్టీకి కష్టపడిన కార్యకర్తలకు గుర్తించి, వారికి వివిధ హోదాల పదవులకు పేర్లను ప్రకటిస్తూ వస్తుంది. ఆ క్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకురాలు, ఏ కార్యక్రమం (బిజెపి పార్టీకి సంబంధించిన) ఉన్న ముందుండి ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తన వంతు పాత్ర పోషించే, అక్క అని పిలిస్తే నేనున్నా అని పలికే బానోత్ జ్యోతికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్టీ మోర్చా మీడియా కో కన్వీనర్ గా ప్రకటించింది. ఈ సందర్భంగా బానోతు జ్యోతి మాట్లాడుతూ నాకు ఈ పదవి బాధ్యతను పెంచింది అని



అన్నారు, నాకు ఈ పదవి రావడానికి సహకరించిన బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నవీన్, రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు నేనావత్ రవి నాయక్, జిల్లా అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి ఆశీస్సులతో ఈ పదవికి న్యాయం చేస్తానని అన్నారు. గిరిజన సోదర, సోదరీమణుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు, అభ్యున్నతికి నా వంతు కృషి చేస్తానని మాట ఇస్తున్నాను. గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తాను. ఈ పదవి నాకు వచ్చిన సందర్భంగా నాకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా ధన్యవాదాలు అని అన్నారు.

## శుభాకాంక్షలు తెలిపిన పి. శ్రావణ్ కుమార్‌తో పాటు ప్రసాద్ చౌదరి

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :
పదవి చేపట్టిన రోజు నుంచి అభినందనల తాకిడి ఎక్కువైంది. ప్రతి ఒక్కరూ ప్రతిరోజు శు భాకాంక్షలు చెప్తూ వస్తున్నారు నాగరాజు కు (జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైనం దున శాలువా లతో ఘనంగా సన్మా నిస్తూ వస్తున్నారు అభి మాను లు) విషయా



నికొస్తే తెలంగాణ బస్తిల జాయింట్ యాక్షన్ కమిటీ (టీబిజెఎసి) జూబ్లీహిల్స్ నియోజకవర్గం కు కొల్లిపర నాగరాజు చైర్మన్ గా నియమించారు. ఈ పదవి వారికి వచ్చినందున వారి మిత్రులు పెరుమండ్ల శ్రావణ్ కుమార్ తో పాటు శ్రీ ప్రసాద్ చౌదరి లు మర్యాదపూర్వకంగా వారిని కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి వారికి( నాగరాజు) హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ మాట్లాడుతూ మా మిత్రుడికి ఈ పదవి రావడానికి సహకరించిన గోసుల శ్రీనివాస్ యాదవ్ (తెలంగాణ బస్తి జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్) ఎర్రోళ్ల శీనన్న (మాజీ కార్పొరేషన్ చైర్మన్), సల్ల శ్రీనివాస్ యాదవ్ (తెలంగాణ బస్ తి జాయింట్ కమిటీ వైస్ చైర్మన్) , అమ్మాజీ ( గ్రేటర్ హైదరాబాద్ జిహెచ్ఎంసి అధ్యక్షురాలు) నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో రవి కళ్యాణ్, శ్రీనివాస్ రెడ్డి, ఇస్మాయిల్, నాగు, నవీన్ పటేల్, వాసు పాల్గొ న్నారు. శ్రీ ప్రసాద్ చౌదరి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నిర్వహించే కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, అందరిలో మంచి పేరు తెచ్చుకున్న నాగరాజుకి చైర్మన్ పదవి రావడం సబబే అని తెలిపారు.

## ఫేస్1లో నిర్వహించిన స్కంద హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరంలో
# 150కు పైగా పాల్గొన్నారు : డాక్టర్. ప్రసన్న కుమార్..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :
గత కొన్ని రోజుల నుంచి సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం నూతనంగా జిహెచ్ఎంసి లో కలిసిన తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేసీఆర్ నగర్ డబల్ బెడ్ రూమ్ ఫేస్ 1లో స్కంద హాస్పిటల్ (నల్లగండ్ల)ఆధ్వర్యంలో ఆదివారం (24/5/2026) ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని చరవాణిల ద్వారా, మీడియా ద్వారా ప్రచారం చేశారు. ఆదివారం రోజు ఫేస్ వన్ లోని మొదటి బ్లాక్ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో మండుతున్న ఎండలకు ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరికి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక టెంట్ వేసి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు స్కంద హాస్పిటల్ ఎండి డాక్టర్ ప్రసన్నకుమార్ (జనరల్ ఫిజీషియన్). ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ వచ్చి వారి అనారోగ్య కారణాల ను చెప్పి దానికి సంబంధించిన మందులు, కావలసిన టెస్టుల గురించి వివరాలు వారి (స్కంద హాస్పిటల్)రిసిప్ట్ ద్వారా ఉచితంగా తెలుసుకున్నారు. స్కంద హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ మనోజ్ఞ, (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ శరత్ (ఆర్థో), డాక్టర్ కీర్తి (గైనకాలజిస్ట్) లు పాల్గొన్నారు. నవీన్ కుమార్ (మార్కెటింగ్ మేనేజర్) ఈ ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ఆరోగ్య రక్షణకు సంబంధించిన సలహాలను ఉచితంగా అందజేసి, మల్టీ విటమిన్, క్యాల్షియం విటమిన్, మొదలుకు మొక్కలను ఉచితంగా అందజేశారు.. ఈ ఉచిత వైద్య శిబిరంలో గోపి ప్రసాద్ (నర్సింగ్ ఇంచార్జ్), బి వెంకటేష్ (మార్కెటింగ్ జనరల్ మేనేజర్), సిహెచ్ మోహన్ బాబు (అసిస్టెంట్ మేనేజర్) లు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో తమ వంతు పాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఎండి డాక్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరం ఇక్కడ పెట్టడం మొదటి సారి అని, 150 మందికిపైగా పేషెంట్లు ఈ ఉచిత వైద్య శిబిరంలో వైద్యం చేసుకున్నారని తెలిపారు.రాబోయే రోజుల్లో ఫేస్ 1 లో



ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని అన్నారు. మొదటిసారి ఇంత మంది నుంచి అపూర్వ స్పందన వచ్చిందని, ప్రతి ఒక్కరూ తమ రోగాన్ని మా అనుభవజ్ఞులైన డాక్టర్లచే చూపించుకొని అవసరమైన సలహాలు, చికిత్సకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు అని, ఏ జబ్బు కైనా మీరు నల్లగండ్ల లో ఉన్న మా స్కంద హాస్పిటల్ కి వచ్చి చికిత్స చేయించుకోవచ్చని తెలిపారు. అవసరం అనుకుంటానే చికిత్స నిర్ణయిస్తామని లేదంటే మందుల ద్వారా వాడితే నయమైతుందని తెలిపి (పేషంట్ చికిత్స విధానాన్ని బట్టి) వారికి అవసరమైన వైద్యాన్ని ఇస్తామని తెలిపారు. ఫేస్ 1 లో మొదటిసారే ఈ కార్యక్రమం (మా స్కంద హాస్పిటల్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం) ఇంత చక్కగా కావడానికి మాకు సహకరించిన మొదటి బ్లాక్ ఝాన్సీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

### విస్తృత సాయి సమావేశం
## ఘనంగా నిర్వహించిన మాజీ కార్పొరేటర్..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



వెంగళరావు నగర్ డివిజన్(జూబ్లీహిల్స్ నియోజకవర్గం) బిఆర్ఎస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు వెంగళరావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ దేదీప్య ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం రాబోయే పార్టీ ఎజెండాలు, సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) గురించి, పార్టీ సభ్యత్వ నమోదు గురించి చర్చించడానికి త్వరలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గంలో విస్తృతస్థాయి ప్రచారం ఉండడం వల్ల కార్యక్రమం యొక్క కార్యచరణను చర్చించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఇంచార్జి విష్ణు వర్ధన్ రెడ్డి, సోహైల్, వివిధ డివిజన్ మాజీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

### ఫేస్ 2లోని 20 బ్లాక్‌లో
## నూతన అధ్యక్షురాలిగా ఏ. శోభా నియామకం..

ఏ ఎం న్యూస్, పటాన్చెరు :



విజయాలు అందుకోటం వాళ్లకి కొత్త కాదు, పనిని సమర్థవంతంగా నిర్వహించి బ్లాక్ లో ఉన్న లబ్ధిదారులకు చేత ప్రశంసలు అందుకోవటం ఆనవైతిగా వస్తున్న వారికి, బ్లాక్ అభివృద్ధి కొరకు పాటుపడుతున్న ఎ.శోభా ఆదివారం (24/5/2026) సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం నూతనంగా జిహెచ్ఎంసిలో కలిసిన తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కెసిఆర్ నగర్ డబల్ బెడ్ రూమ్ ఫేస్ 2 లోని 20వ బ్లాక్‌లో అసిస్టెంట్ సబ్ రిజిస్టర్ రమేష్ బాబు సమక్షంలో ఎన్నికల అధికారి అసిస్టెంట్ రిజిస్టర్ ( రిటైర్డ్) యు. ప్రభు లింగం ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలలో ఏ. శోభ నూతన అధ్యక్షురాలుగా (20 వ) ఎన్నికయింది . ప్రభు లింగం ప్రక టించిన వివరాల ప్రకారం ఎ.శోభా (అధ్యక్షురాలు),ఆర్. సుజాత(వైస్ ప్రెసిడెంట్), షమీం బేగం (సెక్రటరీ), ఎస్ .సుధా (జాయింట్ సెక్రెటరీ), ఎం .శోభారాణి ((ట్రెజరర్), జి. శోభ (డైరక్టర్), డి.ఉమా (డైరక్టర్),పి. ఇందిరా (డైరక్టర్), జోనబి (డైరక్టర్) గా నియమితులయ్యారు అని ప్రకటిం చారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుల సమక్షంలో అధ్యక్షురాలుగా ఎన్నికైన శోభ మాట్లాడుతూ నూతన విధివిధానాలతో, లబ్ధిదారుల సూచనలతో బ్లాక్ అభివృద్ధికై ముందుకు వెళ్తామని అన్నారు. ఈ పదవి నాకు బాధ్యతను పెంచిందని అన్నారు. కొల్లూరు పోలీస్ స్టేషన్ సిఐ ఆదేశాల మేరకు కిందిస్థాయి సిబ్బంది భద్రత ఏర్పాటు చేసి ఈ ఎన్నికను ప్రశాంతంగా జరపడంలో ప్రధాన పాత్ర పోషించారు.

## వంశీ అపార్ట్మెంట్ కమిటీ సభ్యులను అభినందించిన సీఐ. ప్రభాకర్..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వంశీ అపార్ట్‌మెంట్ సంక్షేమ సభ్యులను జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని మధురానగర్ పోలీస్ స్టేషన్ సీఐ ప్రభాకర్ సోమవారం సిబ్బంది సమక్షంలో అధ్యక్షుడు ఆనంద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా సిఐ ప్రభాకర్ మాట్లాడుతూ భద్రత , రక్షణ కోసం కొత్తగా 12 హెచ్‌డి సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసినందుకు వంశీ అపార్ట్‌మెంట్ నివాసితులను, ప్రెసిడెంట్ ఆనంద్ కుమార్, సభ్యులను అభినందించామని, ఇటీవల, ఒక ఆస్తి దొంగ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో దొంగతనం చేయడానికి ప్రయత్నించాడు, కానీ నివాసితుల అప్రమత్తత వారు ఏర్పాటుచేసిన సిసిటివి నిఘా కారణంగా, అనుమానితుడిని పట్టుకున్నామని తెలిపారు.

## సెల్టోరియస్ ఘనంగా ప్రారంభించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



ప్రస్తుత రోజుల్లో హైదరాబాద్ నగరంలో ఆహారం బయట చాలా ప్రాంతాల్లో విరివిగా లభ్యమవుతుంది. అటువంటి ఆహారాన్ని క్వాలిటీతో, రుచితో భోజన ప్రియులకు అందజేసే ప్రయత్నంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో యూసఫ్ గూడా డివిజన్‌లో సెల్టోసిఎస్ షాపుని ఏర్పాటు చేయాలని తలచి, ఏర్పాటు కు ముహూర్తంగా సోమవారం సాయంత్రం నిర్ణయించారు నిర్వాహకులు శ్యామ్, రాహుల్. ఈ షాప్ ఓపెనింగ్ కార్యక్రమానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు క్వాలిటీతో , రుచి తో ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ షాపు ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందిస్తున్నాను అని అన్నారు. నిర్వాహకుల్లో ఒకరైన శ్యామ్ మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుండి 12:00 వరకు రాత్రి 7 గంటల నుండి 12 గంటల వరకు షాపు ఓపెన్ ఉంటుందని తెలిపారు. మరొక నిర్వాకుడు రాహుల్ మాట్లాడుతూ మిల్లెట్స్ బ్రేక్ ఫాస్ట్ డిన్నర్ కి సంబంధించిన ఆహార పదార్థాలు మా దగ్గర లభ్యమవుతారని అన్నారు. రాగి దోశ, రెగ్యులర్ ఇడ్లీ, రాగి జావా, వెజ్ సలాడ్, విచ్ సాండ్విచ్ మొదలు వెరైటీలు లభ్యమవుతాయని తెలిపారు.

### నాచారం హెచ్ ఎం టి నగర్ చెరువులో 37.5 కోట్ల రూపాయల వ్యయంతో

# హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఏ ఎం న్యూస్ ఓయూ:

37.5 కోట్ల రూపాయల వ్యయంతో నాచారం హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులలో భాగంగా సోమవారం చెరువు యొక్క అలుగును తొలగించారు. అలుగు కూల్చివేత పనులను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక నాయకులు మరియు కాలనీ ప్రతినిధులతో కలిసి పర్యవేక్షించారు. దీంతో చెరువులోని నీరు బయటికి వెళ్లి చెరువు తొందర్లోనే ఖాళీ అవుతుంది అని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి తెలియజేశారు. చెరువు ఖాళీ అవడం సుందరీకరణ పనులు ప్రారంభం అవడం పట్ల నాచారం డివిజన్ లోని అన్ని కాలనీల ప్రతినిధులు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తొందర్లోనే పటేల్ కుంట చెరువు కూడా సుందరీ కరణ పనులు ప్రారంభించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో



బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ మరియు హెచ్ఎంటి నగర్ బాపూజీ నగర్ సరస్వతీ నగర్ ఇందిరానగర్ శ్రీ రాఘవేంద్ర నగర్ రాఘవేంద్ర నగర్ అన్నపూర్ణ కాలనీ తదితర కాలనీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన

## టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ టిపిసిసి ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ సచివాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.బండి రమేష్ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రిని కలిసిన రమేష్ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముందుగా రమేష్ సీఎం రేవంత్ కి పూల బొకే ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. తనపై విశ్వాసముంచి కార్పొరేషన్ చైర్మన్ గా తనను నియమించినందుకు సీఎంకి రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎం రేవంత్ రెడ్డి బండిరమేష్ ను అభినందించారు. రాష్ట్రంలోని కమ్మసంఘాలన్నింటిని ఏక తాటిపైకి తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. ఇచ్చిన పదవికి గౌరవం పెరిగేలా వన్నె తెచ్చేలా వ్యవహరించాలని కార్పొరేషన్ ద్వారా సంఘంలోని పేదల అభివృద్ధికి వారిలో రాజకీయ చైతన్యం తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. పేద ప్రజల అభివృద్ధికి సంక్షేమానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు అటు కార్యకర్తలను ఇటు కార్పొరేషన్ కు చెందిన ఆయాసంఘాలను, సభ్యులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లాలని సీఎం సూచించినట్లు బండిరమేష్ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డిప్యూటీ చైర్మన్ పరుచూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

## పవిత్రమైన దేవాలయాల పరిరక్షణ కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది : బండి రమేష్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కాంగ్రెస్ ప్రభుత్వం పవిత్రమైన దేవాలయాల పరిరక్షణ కోసమే నిరంతరం పనిచేస్తుందని తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ లక్ష్మికళ సినిమా హాల్ సమీపంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన ఆలయ కమిటీ చైర్మన్గా రాచమల్ల బిక్షపతి గౌడ్, కమిటీ సభ్యులుగా కావాలి పాండు, ఎం. రమేష్, మెట్టు వినోద్, పి. నర్సింగ్ రావు, నోముల బాబురావులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో బండి రమేష్ మాట్లాడుతూ గతంలో చిన్న గుడిగా ఉన్న శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మాణం చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చిన మాజీ కౌన్సిలర్ తూము ఎల్లారావుని ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, దేవాలయాల పరిరక్షణ, ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏ బ్లాక్ అధ్యక్షులు పటోళ్ల నాగిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, గాలి బాలాజీ , కోపిశెట్టి దినేష్ కుమార్ ,గంధం రాజు, నియోజకవర్గ ఓబీసీ అధ్యక్షులు తూము సంతోష్, రాచమల్ల శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సలహాదారు వి. హనుమంతరావు సన్మానించిన మున్నూరు కాపు సంఘం సభ్యులు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కాచిగూడ మున్నూరు కాపు సంఘంలో విద్యార్థి వసతి గృహం మాజీ ట్రస్టీలు దాడువాయి రాఘ వేందర్, ఆకుల పాండురంగారావు, మందా సూర్య ప్రకాష్ల ఆధ్వర్యంలో మున్నూరు కాపు భీష్మ పితామహుడు మాజీ రాజ్యసభ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల అడ్వైజర్గా తెలంగాణ ప్రభుత్వం నియమించిన సందర్భంగా విహనుమంతరావుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్క యాదిగిరి రావుకి, పసుపులేటి హనుమంతరావుకి వారు చేసిన విశేష కృషికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించడం జరిగినది. ఈ సందర్భంలో వారికి కూడా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే తెలంగాణమున్నూరు కాపుకార్పొరేషన్చైర్మన్గా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని, వైస్ చైర్మన్గా అల్లం భాస్కర్ని నియమించిన సందర్భంగా వారిని కూడా ఘనంగా సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మాజీ అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వరరావు, లవంగాల అనిల్, ఏనుగుల వెంకటేశ్వర రావు, మసాలా బాబు, కావేటి గోవిందరాజు, సప్పిడి శ్రీనివాస్రావు, సన్మాన గ్రహీతులను దృశ్యాలతో సత్కరించారు.

## పవిత్రమైన దేవాలయాలు ఆధ్యాత్మిక చింతనకు నిలయాలు...

### – పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



పవిత్రమైన దేవాలయాలు ఆధ్యాత్మిక చింతనకు నిలయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. మూసాపేటలోని శ్రీ నల్ల పోచమ్మ దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణస్వీకారంలో పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి అమ్మ వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్ గా రాచమల్ల బిక్షపతి గౌడ్, సభ్యులు గా కవలి పండు, ఎం. రమేష్, పేరుమండ్ల నర్సింగ్ రావు, నోముల బాబు రావు, మెట్టు వినోదలకి శుభాకాంక్షలు తెలియజేసి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అందించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. నూతన పాలక మండలి సభ్యులు భక్తులకు అందుబాటులో ఉండాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం దేవాలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్ష్యులు తూము వేణు, శేఖర్ గౌడ్, తూము సంతోష్ పటేల్, సునీల్ యాదవ్, గాజుల మహేష్ గౌడ్, సప్పిడి భాస్కర్, సత్యనారాయణ, గజానంద్ శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### తార్నాకలో రియాన్స్ హోటల్

## మెనేజ్మెంట్ కాలేజీ ప్రారంభోత్సవం..

### సందడి చేసిన హీరోయిన్ ప్రణీత

ఏ ఎం న్యూస్ ఓయూ:

తార్నాకలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన రియాన్స్ హోటల్ మెనేజ్మెంట్ కాలేజీ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సినిమా హీరోయిన్ ప్రణీత, అంబర్పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నిర్వాహకులు ఫౌండర్ డైరెక్టర్ శ్రీవాణి, మహేందర్



తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కాలేజీని ప్రారంభించిన ప్రణీత విద్యార్థులతో కలిసి కొంత సేపు సరదాగా సందడి చేశారు. విద్యార్థులు ఆమెతో సెల్ఫీలు దిగడానికి పోటీ పడ్డారు.

### కరెంటు కోతల నివారణకు పట్టణ వాసులు మెమోరాండం

ఏ ఎం న్యూస్, యాదగిరిగుట్ట :



ప్రస్తుత వేసవి తాపం, ఎండల తీవ్రత నేపథ్యంలో యాదగిరిగుట్ట పట్టణంలో అప్రకటిత విద్యుత్ కోతలు, అంతరాయాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు కరెంటు ఏ ఈ కి మెమోరాండం అందజేశారు ఎండల తీవ్రత రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో,ఏసీలు కూలర్లు పనిచేయక ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉక్కపోతకు తోడు పగలు, రాత్రి అనే తేడా లేకుండా తరచూ కరెంట్ పోతుండటంతో గృహ వినియోగదారులు, రైతులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు.కరెంటు ఏ ఈ సురేందర్ నాయుడు చరవాణిలో మాట్లాడుతూ సరిపడా విద్యుత్ ఉత్పత్తి ఉన్నప్పటికీ,డిమాండ్ ఒక్కసారిగా పెరగడం, సబ్స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఈ అంతరాయాలు చోటు చేసుకుంటున్నట్లు ఉందని ఈ సమస్యని రెండు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో మందోజు నరేష్, కోట కర్ణాకర్ స్వామి,దాసు,సీసా శ్రీను, బొమ్మ సురేష్, శంకర్,తదితరులు పాల్గొన్నారు.

### గోవులను పూజించండి..

## పండుగలను ఐక్యతతో జరుపుకోండి..

### – సైబరాబాద్ సీపీ డాక్టర్ రమేష్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్ రెడ్డి గోవులను భక్తితో పూజించండి ఐక్యతో పండగలు జరుపుకోండి అనే కార్యక్రమం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కాన్ఫిడెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ గోవులను భక్తితో పూజించి వాటిని రక్షించవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని తెలియజేశారు. అదేవిధంగా బక్రీద్ పండుగ సందర్భంగా శాంతియుతంగా సామరస్యంగా ఐక్యతతో పండుగ జరుపుకోవాలని సూచిం చారు. రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ కూక ట్పల్లిలో గోవుల విషయంలో కూకట్పల్లి పోలీస్ సిబ్బంది గోవులను రక్షించడానికి శ్రేయ శక్తుల కృషి చేస్తున్నారని తెలిపారు. గోవులను పోషించడానికి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని వాటికి పోషించడానికి విశాలమైన ప్రదేశాలు లేవు మంచినీటికి గడ్డికి పశుగ్రాసానికి ఇబ్బందులు ఉన్నా యని తెలిపారు. అధికారులు ప్రభుత్వ దృష్టికి పట్టణ ప్రాంతంలో గోశాలలకు సరైన ప్రదేశాలు లేక ఇబ్బందులు ఉన్నాయని పల్లె ప్రాంతంలో గోశాలలు నిర్మించి వాటిని సమరక్షించాలని పురేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ యశ్వంత్ లక్ష్మీనారాయణ జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్. శ్రీనివాసరావు (తులసిరావు) మర్యాద అశోకులు..

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :





కూకట్పల్లి నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి సోమవారం హాజరైన బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వ కుంట్ల తారక రామారావుని పలువురు బి.ఆర్.ఎస్ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. కూకట్పల్లిలోని శ్రీ కోదండరామ స్వామి దేవాలయం మాజీ చైర్మన్ ఎన్. శ్రీనివాసరావు (తులసిరావు), మర్యాద అశోక్ తదితరులు కేటీఆర్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఇరువురికి శాలువాతో సత్కరించి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచనలు చేశారు.

### ముఖ్యమంత్రిని కలిసిన వాషర్మెన్

## (రజక) కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర వాషర్మెన్(రజక) కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ దాసరిరాజు అజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా సీఎంను కలిసిన అజయ్ కుమార్కు ముఖ్యమంత్రి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వాషర్మెన్ సమాజ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, కార్పొరేషన్ ద్వారా చేపట్టాల్సిన పథకాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం రజకుల సంక్షేమం కోసం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్పొరేషన్ బలోపేతానికి అవసరమైన అన్ని చర్యల్లో ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. దాసరిరాజు అజయ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 12 సవంత్సరాల తరువాత మొట్ట మొదటి సారిగా కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు రజక సమాజం నుంచి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. వాషర్మెన్ కార్పొరేషన్ సమాజ హక్కులు, యువతకు ఉపాధి అవకాశాలు, GO 102, యువత అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు. సీఎం ఇచ్చిన ప్రోత్సాహం తనకు మరింత బాధ్యతను గుర్తు చేసిందన్నారు. సామాజిక న్యాయం, బీసీ వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, తన నియామకం ఆ దిశగానే మరో కీలక అడుగని అజయ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వాషర్మెన్ కుటుంబాలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

# శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆశీస్సులతో అతిథి అధ్యాపకుల మహా పాదయాత్ర

### వైకుంఠ ద్వారాం నుండి పాదయాత్ర ప్రారంభించిన గెస్ట్ లెక్చరర్స్

ఏ ఎం న్యూస్, యాదగిరిగుట్ట :

యాదగిరిగుట్ట నుండి హైదరాబాద్ వరకు మహా పాదయాత్ర ప్రారంభించి నిర్వహణ వెట్టి చాకిరి నిర్మూలనను,సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేసే గెస్ట్ లెక్చరర్లు ర్యాలీ విజయవంతం కొరకు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నామని స్వామి వారి పాదాల వద్ద నుండి పాదయాత్ర ప్రారంభించి అమరవీరుల స్తూపం వద్ద విలేకరుల సమావేశంలో అతిథి అధ్యాపకుల సంఘం నాయకులు నర్సింగ్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న అతిథి అధ్యాపకుల విషయంలో జరుగుతున్న వేట్టే చాకిరి నిర్మూలన,సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 25, 26, 27 తేదీలలో మహా పాదయాత్ర ప్రారంభించమని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అభివృద్ధి కోసం, విద్యార్థుల భవిష్యత్తు కోసం కష్టపడు తుంటే తమ జీవితాలకు,ఉపాధికి భద్రత లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలని కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టోలో తమకు ఉద్యోగ భద్రత, రూ.50,000/-తో కూడిన గౌరవవేతనం ఇస్తామనిహామీ ఇచ్చిందని ఇప్పుడు పట్టించునే నాదుడే కరువయ్యాడని అతిథి అధ్యాపకుల బతుకు దినదినగండం లాగా మారిందని, 1940




మంది కుటుంబాలు ప్రతి సంవత్సరం నరకం చూస్తున్నాయని, రెన్యువల్ లేకుండా డెమో, త్రీమెన్ కమిటీ పేరుతో మానసికంగా హింసిస్తున్నారని కేవలం 6 నెలల వేతనం తీసు కుంటూ 12 నెలలు వెట్టిచాకిరి చేస్తున్న అభాగ్యులం అని, ప్రభు త్వం తమ సమస్యపై దృష్టి పెట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు.మా న్యాయమైన డిమాండ్లు ఆటో రెన్యువల్ విధానం వెంటనే అమలు చేయాలని కన్సాలిడేటెడ్ పద్ధతిలో నెలవారీ వేతనాలు చెల్లించాలని సర్వీస్ వెయిటేజ్ మరియు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సెలవుల సమయంలో కూడా గౌరవ వేతనం చెల్లించాలని తమ న్యాయపరమైన డిమాండ్స్ కోరారు ఈ కార్యక్రమానికి టీఆర్ఎస్ పార్టీ అధినేతి కల్వకుంట్ల కవిత పూర్తి మద్దతుగా నిలిచారని యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు సుజిత్ రావు ఆధ్వర్యంలో మద్దతుగా పలికారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మచ్చ చక్రిధర్.ఆకుల నరేష్,అధ్యాపకులు శంకరయ్య, చంద్రశేఖర్, వెంకటరెడ్డి, భూచ్చిపాల్ రెడ్డి, సుధమ, సంధ్య, స్వప్న, కిషోర్, హరికృష్ణ, రాజేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు...